క్లుప్తంగా

చేపల మార్కెట్ కిటకిట



రింగురోడ్డు వద్ద చేపలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

విజయనగరం: నగరంలోని రింగురోడ్డు దగ్గరున్న చేపల మార్కెట్ కొనుగోలుదారులతో ఆదివారం కిటకిటలాడింది. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో ఈ కాలంలో చేపలు తింటే ఆరోగ్యమని ప్రజల నమ్మకం. ఈ నేపథ్యంలో చేపల దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. తమకు ఇష్టమైన చేపలను కొనుగోలు చేసేందుకు ప్రజలు కూడా పెద్దఎత్తున ఆసక్తి చూపించడంతో మార్కెట్ కళకళలాడింది. నగరంలోని రింగురోడ్డు సహా ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్, పెద్దమార్కెట్, ఆర్‌అండ్‌బీ జంక్షన్ తదితర ప్రాంతాల్లోనూ చేపల విక్రయాలు బాగా జరిగాయి.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: స్థానిక గుంటూరు వారి వీధిలోని బృందావనం అపార్ట్‌మెంట్ ఆవరణలో శ్రీగణపతి రాధాకృష్ణ సమేత షిర్డీసాయినాథుని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివార్ల విగ్రహాలకు తొలుత ప్రాణప్రతిష్ఠ చేసి, ప్రతిష్ఠాపన మహోత్సవం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో బాలలు

విజయనగరం టౌన్: స్థానిక వ్యాసనారాయణ మెట్ట దగ్గరున్న శిల్పారామంలో ఆదివారం సాయంత్రం చేపట్టిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆర్‌కే స్టూడియో డ్యాన్స్ డైరెక్టర్ లోకేష్ ఆధ్వర్యంలో బాలల బృందం చేసిన నృత్యం చూపరులను అలరించింది. ప్రధానంగా కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ అధికారి యు.రమణ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం విడుదల చేయండి

బొండపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పురం అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నేటికి ఒక్క రుపాయి కూడా పెట్టుబడి సాయం అందించలేదని పేర్కొన్నారు. హామీ ప్రకారం ఒకే విడతలో 20 వేల రూపాయల సాయం అందించాలన్నారు. అలాగే మరో ఐదు రోజుల్లో పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో తల్లికి వందనం పథకం అమలు చేయాలని కోరారు.

పోతురాజుకు ప్రత్యేక పూజలు



పోతురాజును దర్శించుకుంటున్న భక్తులు

వేపాడ: మండల కేంద్రంలో రజకులు నిర్మించుకున్న నూతన ఆలయంలో పోతురాజు విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. లక్ష్మీగణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో గ్రామ పురోహితుడు గోపాజోస్యుల సాయిరామ్‌శర్మ మంత్రోచ్చారణల నడుమ విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన, పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ప్రతిభా అవార్డుకు ఎంపికైన అమ్నా తస్లీం



అమ్నా తస్లీం

గంట్యాడ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని అమ్నా తస్లీం ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు. ఇంటర్మీడియట్ హెచ్‌ఈసీ గ్రూప్‌లో 952 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. దీంతో ఆమెకు ప్రతిభా అవార్డు వరించింది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ ఎల్‌వీఎస్ జగన్నాథరావు, సిబ్బంది అభినందించారు.

అప్రమత్తతే రక్ష!



పూసపాటిరేగ పీహెచ్‌సీలో రోగులకు వైద్యసేవలందిస్తున్న వైద్యాధికారి రాజేష్‌వర్మ(ఫైల్)



- మారుతున్న వాతావరణం
- వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- జలుబు, దగ్గు, జ్వరం రాకుండా జాగ్రత్త వహించాలి
- ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యుడిని సంప్రదించాలి

పూసపాటిరేగ: వాతావరణం మారుతున్న వేళ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పుడే వేసవి పోయి వర్షాకాలం ఆరంభం కానుండడంతో జలుబు, దగ్గు, జ్వరం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు రాను రాను మరింత ఎక్కువ కానున్నాయని, భూగర్భ జలం కలుషితమై ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇప్పటికే పలువురు డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో మంచానపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన సదుపాయాలు లేకపోవడంతో వైద్య సేవల కోసం ప్రైవేటు ఆస్పత్రులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

రోజుకు 250 మంది వరకు..

నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల మండలాల్లో మొత్తం 145 గ్రామాలు ఉండగా, ఆయా మండలాల్లోని ప్రజలకు వైద్యసేవల కోసం ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో రోజుకు 250 మంది వరకు వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారిలో అధికంగా డయేరియా, జలుబు, దగ్గు, జ్వరం, దురదలతో బాధపడేవారే ఎక్కువగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ప్రస్తుతం చాలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వసతులు, సకాలంలో వైద్యసేవలు అందకపోవడంతో దగ్గరలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టిసారించకపోవడంతోనే తమకు ఈ దుస్థితి అని పలువురు రోగులు వాపోతున్నారు. సర్కారు ఆస్పత్రుల్లోనే వైద్యం చక్కగా అందితే తామెందుకు ప్రైవేటు వైద్యుల వద్దకు వస్తామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అవసరమైన చోట సదుపాయాలు మెరుగుపరచాలని, పేదలకు వైద్యం బాగా అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

అపారిశుధ్యం వల్లే రోగాలు ప్రబలుతున్నాయి. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆహారం తినే ముందు తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. వేడి, చల్లని పదార్థాలు వెంటనే తినవద్దు. ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు వెంటనే వైద్యుడిని కలిసి పరీక్షించుకోవాలి.

– రాజేష్‌వర్మ, వైద్యాధికారి, పూసపాటిరేగ పీహెచ్‌సీ

కాచిచల్లార్చిన నీరు తాగాలి..

కాచిచల్లార్చిన నీరు తాగాలి. ఇలా చేస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవు. ప్రస్తుతం మారుతున్న చల్లని వాతావరణానికి జలుబు, జ్వరం, దగ్గు, దురదలు వచ్చే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లే.

– పి.భాస్కరరావు, పూసపాటిరేగ

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవాలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బర్లపేట రామ మందిరం ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, శాంతి కల్యాణ మహోత్సవం కార్యక్రమాలు చేపట్టారు. ఇదిలా ఉండగా ఆలయ అభివృద్ధికి దాతలు చనమల్లు వెంకటరమణ రూ.50 వేలు, జమ్ము రమణ రూ.30 వేలను విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ తదితరులు ఆలయాన్ని సందర్శించుకుని, సీతారాములను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చనమల్లు స్వాతి, నాయకులు జమ్ము సత్తిబాబు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



విజయనగరం టౌన్: ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ల బృందం

విజయనగరం టౌన్: లోక రక్షకుడు క్రీస్తు అని, ఆయన బోధనలు అనుసరణీయమని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమానందం తెలిపారు. స్థానిక వీటీ అగ్రహారం కొత్తమజ్జిపేట చర్చిలో ప్రపంచ ప్రార్థన దినోత్సవం ఆదివారం నిర్వహించారు. మతవిశ్వాసులంతా చర్చికి చేరుకుని, ఏసుప్రభువును ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్వమానవాళి పాప పరిహారానికి జీవితాన్నే త్యజించి గొప్ప దయామయుడు, ఏసుక్రీస్తు అని ఆయన బోధనల అనుసారంతోనే ప్రపంచ శాంతి, సమాధానం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కె.ఉదయ్‌కుమార్, జి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో ప్రపంచ ప్రార్థన దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా క్రిస్టియన్ ఫెడరేషన్ అధ్యక్షుడు రెవరెండం బీఎం రాజు, పలు చర్చిల పాస్టర్లు అంతా ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రేమ, కరుణ, జాలి, దయ వంటి గుణాలతో జీవించాలని యేసుప్రభువు తెలిపారని, ఆయన బోధనలు ప్రపంచ శాంతికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో భాగంగా పాస్టర్ సైమన్ బృందం ఆలపించిన క్రీస్తు స్తుతి ఆరాధన గీతాలు మతవిశ్వాసకుల్లో భక్తిభావం పెంపొందించాయి. కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి రెవరెండం ఎం.ఐజాక్, కోశాధికారి బిషప్ ఎం.పాల్సన్ తదితరులు పాల్గొన్నారు.



క్రీస్తును ఆరాధిస్తూ గీతాలాపన చేస్తున్న యువత

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ త్రినాథరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. 11 కేవీ వ్యవసాయ విద్యుత్ లైన్ల మరమ్మతులతో పాటు కరెంట్ తీగలను తాకే చెట్టు కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, వెంకన్నపాలెం, మల్యాడ గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

డెంకాడ: మండలంలోని డెంకాడ, చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విజయనగరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు ఆదివారం తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల దృష్ట్యా డెంకాడ సబ్‌స్టేషన్ పరిధిలోని గుణుపూరుపేట, ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, గువ్వపేటలతో పాటు చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ పరిధిలోని జొన్నాడ, గెద్దవానిగుడ్డి, దువ్వపేట, మన్యాలపేట, ఆకులపేట, డి.తాళ్లవలస గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నెలకొనే ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అధ్వాన రహదారితో అవస్థలు..



కొత్తవలస - విజయనగరం రోడ్డులో చింతలదిమ్మ వద్ద పరిస్థితి



గిడిజాల జంక్షన్ వద్ద రోడ్డు దుస్థితి



హైస్కూల్ సమీపంలో అధ్వానంగా మారిన రహదారి



రోడ్డులో జయా థియేటర్ సమీపంలో రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి

కొత్తవలస: సంక్రాంతి పండగకు గ్రామీణ రోడ్లతో పాటు పట్టణ రోడ్లను సైతం అత్యంత నాణ్యతగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీలు గుప్పించారు. అయితే మాటలకు, క్షేత్ర స్థాయిలో జరిగిన పనులకు ఎంతో తేడా ఉంది. కూటమి హయాంలో చేపట్టిన రోడ్ల మరమ్మతులు, రీవైండింగ్ పనులు అత్యంత నాసిరకంగా చేపట్టారనేందుకు చక్కటి ఉదాహరణ కొత్తవలస - విజయనగరం ప్రధాన రోడ్డు. ఈ రోడ్డును చూస్తే చంద్రన్న నాణ్యత ఇట్టే తెలిసిపోతుంది. వివరాల్లోకి వెళితే.. కొత్తవలస - విజయనగరం ప్రధాన రోడ్డుకు గడిచిన సంక్రాతి నాటికి సుమారు రూ. 3 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. అయితే నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రోడ్డు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ప్రస్తుతం రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గోతులేర్పడి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఆరు నెలల కిందటే మరమ్మతులు చేపట్టారు. ఇంతలోనే ఇలా తయారైంది అంటూ వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కొత్తవలస జంక్షన్ ,జయా థియేటర్, గిడిజాల జంక్షన్, చింతలదిమ్మ జంక్షన్‌ల వద్ద పెద్ద పెద్ద గోతులేర్పడ్డాయి. ఈ గోతుల్లో పలువురు వాహనదారులు పడి గాయపడ్డారు కూడా. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేసిన మరడాం గ్రామస్తులు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామంలో జాతీయ రహదారి పక్కన షిర్డీసాయి బాబా ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యులు ఆదివారం భూమి పూజ చేశారు. గ్రామానికి చెందిన రవి స్వామి ఆధ్వర్యంలో నూతన ఆలయ నిర్మాణానికి గుగ్గిలపు నరసింగరావు, నారాయణరావు దంపతులు శంకుస్థాపన చేశారు. 1992లో నిర్మించిన ఆలయం రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారని.. దీంతో మరో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోతల శంకరరావు, వెంకటరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు



వెల్దాంలో ఆవిష్కరించిన అంబేడ్కర్ విగ్రహం

వేపాడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని.. రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పించిన ప్రపంచ మేధావి అందరివాడని దళిత నాయకుడు పి. పెంటారావు అన్నారు. వీలుపర్తి పంచాయతీ వెల్దాంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పలువురు దళిత నాయకులు, గ్రామపెద్దల సమక్షంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెంటారావు మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు మేలు జరిగేలా రాజ్యాంగాన్ని రూపొందించడంతో పాటు అసమానతలకు తావులేకుండా పోరాటం చేసిన మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో దళిత మహాసభ నాయకులు నక్కెళ్ల నాగమణి, భీమ్‌సేన రవి సిద్ధార్థ, సర్పంచ్ శానాపతి లీల, పెద్దలు శానాపతి అప్పారావు, గోకేడ సత్యంనాయుడు, రావాడ వెంకటరావు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ..

గజపతినగరం: ఇటీవల కాలంలో యువతకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. నిత్యం వ్యాయామాలు, యోగా చేస్తూ మెరుగైన ఆరోగ్యానికి సాధన చేస్తున్నారు. ముఖ్యంగా ఆదివారం వచ్చిందంటే మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో అధిక సంఖ్యలో యువత వ్యాయామాలు చేస్తూ కనిపిస్తోంది. ఇటీవల కాలంలో యోగాంధ్ర కార్యక్రమాలు జోరుగా సాగుతుండడంతో ఆసనాలు కూడా వేస్తున్నారు.



గజపతినగరం క్రీడా మైదానంలో రన్నింగ్ చేస్తున్న యువత



యోగాసనాల్లో యువత

గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవార చెక్‌పోస్టు వద్ద గంజాయి పట్టుబడినట్లు ఎస్.కోట పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా విశాఖపట్నానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎస్.ఆశీష్‌కుమార్, ఎం.లికిత్ ద్విచక్ర వాహనంపై అరకు నుంచి విశాఖకు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవంగా రామాలయ పునఃప్రారంభోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: మండలంలోని కొండగండ్రేడులో రామాలయ పునఃప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు వరదా ఈశ్వరరావు, జమ్ము స్వామినాయుడు, కెంగువ మధుసూదనరావు, తోట తిరుపతిరావు, తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సుమారు ఐదు వేల మందికి అన్నదానం నిర్వహించినట్లు సర్పంచ్ సారిక గోవింద్ తెలిపారు.

వెల్‌నెస్ సెంటర్ భవనం పూర్తయ్యేనా..!



పూర్తికాని వెల్‌నెస్ సెంటర్ భవనం

దత్తిరాజేరు: మండలంలోని వి. కృష్ణాపురం గ్రామ సచివాలయం పక్కన నిర్మిస్తున్న వెల్‌నెస్ సెంటర్ భవనం ఎప్పుడు పూర్తవుతుందా అని స్థానికులు ఎదురు చూస్తున్నారు. 11 లక్షల రూపాయలతో అప్పట్లో నిర్మాణం చేపట్టగా.. శ్లాబ్ పూర్తయ్యేసరికి ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు, పాలకులు స్పందించి భవనం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.